

అడుగంటిన ఆశలు

నీరులేక ఎండుతున్న పొలాలు
- గుండ్లవాగు ఆయకట్టు రైతుల ఇక్కట్లు
- బోర్లు వేసుకుంటే అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులు
- అయోమయంలో 400 మంది అన్నదాతలు

గుండ్లవాగులో నీరు సమృద్ధిగా రావడంతో అన్నదాతలు ఆశగా వరిసాగు చేశారు. పంట ఏపుగా ఎదిగి.. పొట్టదశలో ఉన్నప్పుడు గుండ్లవాగు అడుగంటడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. పంటను కాపాడుకునేందుకు బోర్లు వేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

– గోవిందరావుపేట

గోవిందరావుపేట మండల పరిధిలోని మొద్దులగూడెం, రాంపూర్ సమీపంలోని సర్వే నంబర్ 41లో 183 ఎకరాల్లో 108 మంది పట్టాదారులు, కర్లపల్లిలోని సర్వే నంబర్లు 91, 175, 94, 171, 95 లో ఉన్న 220 ఎకరాల్లో సుమారుగా 80 మంది పట్టాదారులు గల రైతులకు చెందిన పంట పొలాలు నీరులేక ఎండిపోతున్నాయి. దీంతో ఆయా రైతులు వారి పొలాల్లో బోర్లు వేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు పంట ఎండిపోతే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ లోపం..

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ భూముల వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. రెవెన్యూ, అటవీశాఖల మధ్య సరిహద్దు వివాదాలు కూడా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రైతులకు ఇచ్చిన అసైన్డ్ పట్టాలను కూడా అటవీ శాఖ తమకు చెందినవిగానే క్లయిమ్ చేస్తూ గిల్లికజ్జాలకు దిగుతుండడంతో మండలంలో సరికొత్త వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాగా, మండలంలోని మొద్దులగూడెం, రాంపూర్, కర్లపల్లి గ్రామాల రైతులు 50 సంవత్సరాలుగా ఎలాంటి ఆటంకం లేకుండా వరిసాగు చేసుకుంటున్నారు. గతంలో కొంత మంది రైతులు వారి పొలాల్లో బోర్లు వేసుకున్నారు. నాడు అడ్డుకోని ఫారెస్ట్ అధికారులు ప్రస్తుతం అడ్డుకోవడంలో అంతర్యం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. 50 సంవత్సరాల నుంచి లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు కక్ష్య సాధింపు చర్యలకు దిగుతున్నారని రైతులు వాపోతున్నారు.


పస్రా ఫారెస్ట్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)




మొద్దులగూడెంలో నీరు లేక పూర్తిగా ఎండిన వరి

మంత్రి సీతక్క స్పందించాలంటున్న రైతులు

ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు పొలాల్లో బోర్లు వేసుకుంటుంటే పస్రా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. 50 సంవత్సరాలుగా ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నాం.. పట్టా పాస్ బుక్‌లు ఉన్నాయి.. బ్యాంక్‌ల నుంచి కూడా రుణాలు తీసుకున్నాం.. 2013లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సీతక్క.. 400 మంది రైతులకు పట్టా పాస్ బుక్‌లు ఇచ్చారు.. కానీ, ఫారెస్ట్ అధికారులు రెండేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క జోక్యం చేసుకొని తమ పంటలను కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతాం..



50 సంవత్సరాలుగా ఇదే భూమిలో వ్యవసాయం చేస్తున్నాం.. వరి పొట్టదశకు వచ్చిన సమయంలో నీరులేక ఎండిపోతుంటే, బోర్లు వేసుకుంటున్నాం. పస్రా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సరికాదు. పంట ఎండిపోతే తీవ్రంగా నష్టపోతాం. మంత్రి సీతక్క చొరవ చూపి న్యాయం చేయాలి.

– రుద్రారపు సాయిబాబా, రైతు, మొద్దులగూడెం

రైతులకు న్యాయం చేయాలి



మంత్రి సీతక్క చొరవతీసుకుని ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలి. 400 మంది రైతులను పస్రా ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులు వారి పొలాల్లో బోర్లు వేసుకుంటుంటే అడ్డుకోవడం సరికాదు. ఒక్క ఎకరం ఎండిపోయినా ప్రభుత్వానిదే బాధ్యత. రైతులకు అన్యాయం జరిగే ఊరుకోం. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి సమస్యకు పరిష్కారం చూపాలి.

– మడిపెల్లి శ్యాంబాబు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు

అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు

రైతులు ఇన్ని రోజులు వ్యవసాయం చేస్తున్నా.. మేము అడ్డుకోలేదు. కానీ, బోర్లు వేస్తానంటే ఎలా పర్మిషన్ ఇస్తాం. ఆ భూమి ఫారెస్ట్ లేయర్‌లో ఉండడం వల్ల అడ్డుకోవాల్సి వచ్చింది. వన్ యాప్‌లో రైతుల సాగు చేసుకుంటున్న భూమి 360, 307 కంపార్ట్‌మెంట్‌లో చూపిస్తుంది. రైతులు సాగు చేసుకుంటున్న భూములు ఫారెస్ట్‌లోనే చూపిస్తుంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ మీదికి వస్తే అర్థం అవుతుంది.

– సుజాత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, పస్రా


పొట్టదశలో ఎండిపోతున్న వరి పంట

రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- కలెక్టర్ దివాకర

వెంకటాపురం(కె): రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని కలెక్టర దివాకర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో బాండ్ మొక్కజొన్న విఫలంపై రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 25న రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని త్రీమెన్ కమిటీ సందర్శించి నివేదిక తయారు చేసి జిల్లా పరిపాలన శాఖకు పంపించినట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ట్రిబల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.25వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. చేయూత స్కీమ్ నుంచి రూ.20 వేలు అందజేసేలా ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. కమిషన్ సూచనమేరకు బాధిత కుటుంబాల్లోని విద్యార్థులను లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాల, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. నష్టపరిహారాన్ని నిర్ణేశించేందుకు నేడు(శనివారం) కలెక్టరేట్‌లో కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పులి జాడ కోసం గాలింపు

ములుగు రూరల్: ములుగు మండలంలోని అంకన్నగూడెం– సర్వాపూర్ గ్రామాల అటవీ ప్రాంతంలో గురువారం పులి ప్రవేశించింది. ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పాదముద్రల ఆధారంగా పులి సంచారాన్ని నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం అటవీశాఖ అధికారులు పులిజాడ కోసం గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ.. అంకన్నగూడెం, సర్వాపూర్, పెగడపల్లి, జగ్గన్నగూడెం, కొత్తగూడ వైపు అటవీ ప్రాంతాల్లో 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి పాదముద్రల కోసం సిబ్బంది గాలించినప్పటికీ ఆధారాలు లభించలేదని అన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పులి ఆచూకీ తెలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని, ఎలాంటి హానీ తలపెట్టకూడదని అన్నారు.

న్యూస్‌రీల్

రామప్ప హుండీ ఆదాయం రూ.4.47 లక్షలు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయ హుండీలోని కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.4,47,784 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎస్.కవిత, ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, ఆలయ సిబ్బంది మార్క సంతోష్, అవినాశ్‌రెడ్డి, సంతోష్, దామోదర్, రత్నకుమారి, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పస్రా అంగడి వేలం




గోవిందరావుపేట: మండలంలోని పస్రా నాగారం గ్రామ పంచాయతీ ఆవరణలో పస్రా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో అంగడి వేలంపాటను శుక్రవారం నిర్వహించారు. సీల్డ్ కవర్ ద్వారా రూ.4,50,500 కు పాలబోయిన వెంకటకృష్ణ ఈ వేలం దక్కించుకున్నట్లు పస్రా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సృజన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత, టెండర్‌దారులు పాల్గొన్నారు.

చిరుతపల్లిలో వైద్యశిబిరం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు క్రాంతి కుమార్, విపిన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుతపల్లి గ్రామంలో వైద్యసిబ్బంది ఇంటింటికీవెళ్లి సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. రక్త నమూనాలను ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం రామవరం, బర్లగూడెం గ్రామలను సందర్శించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూర్ణ సంపత్‌రావు, డీఈఎంఓ సంపత్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ ధ్యేయం



కాటారం: రాజ్యాంగ పరిరక్షణ, అంబేడ్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాటారం మండలకేంద్రంలో శుక్రవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధన్' సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంగా రాఘవరెడ్డి హాజరై మాట్లాడారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, యూత్ అధ్యక్షుడు చిటూరి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్ జీ

ములుగు: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారించాలని, ప్రమాద ప్రాంతాలను గుర్తించి తగుజాగ్రత్తలను తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో రహదారులపై ప్రమాదాలను తగ్గించడానికి పాటించాల్సిన విధానాలపై ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్‌లతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ప్రమాదాలను నివారించడం కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి 163పై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రదేశాల వద్ద ఎలాంటి చర్యలను తీసుకోవాలనే విషయంపై చర్చించారు. అధికారులు ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు వెళ్లి నివేదికను ఇవ్వాలన్నారు. వేగాన్ని నివారించడం కోసం బారికేడ్లు, డంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాంకేతిక సమస్య వలన ఒక్క ప్రమాదం కూడా జరుగొద్దని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా ఇతర శాఖలతో సమన్వయంగా పని చేయడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా రవాణాధికారి శ్రీనివాస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహణకు ఆమోదం

- వాడగూడెంలో పెసా గ్రామసభ


గ్రామసభలో మాట్లాడుతున్న కొమురం ప్రభాకర్


ఆమోదం తెలుపుతున్న సొసైటీ సభ్యులు

మంగపేట: మండలంలోని వాడగూడెంలో శ్రీనల్ల పోచమ్మతల్లి గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీ నిర్వహణ కొనసాగించేందుకు పెసా గ్రామసభలో సభ్యులు ఆమోదం తెలిపారు. జిల్లా కలెక్టర్, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు గ్రామంలోని అర్హత కలిగిన సొసైటీని గుర్తించేందుకు పంచాయతీ ప్రత్యేకాధికారి, ఏఈఓ భావన అధ్యక్షతన శుక్రవారం పెసా గ్రామసభను నిర్వహించారు. గ్రామసభకు ఏటూరునాగారం ఐటీడీఏ పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. గ్రామంలోని 04, 05 ఇసుక క్వారీల నిర్వాహణకు శ్రీనల్ల పోచమ్మతల్లి, పగిడిద్దరాజు సమ్మక్క–సారక్క రిజిష్టర్డ్ గిరిజన ఇసుక సొసైటీలు ఉన్నప్పటికీ పగిడిద్దరాజు సమ్మక్క–సారక్క సొసైటీ నిర్వహణపై ఆడిట్ లేని కారణంగా శ్రీనల్లపోచమ్మతల్లి సొసైటీకి మాత్రమే అర్హత కలిగి ఉందన్నారు. దీనిపై రెండు సొసైటీలలోని సభ్యులు వారి అభిప్రాయాన్ని తెలపాలని కోరారు. గ్రామంలోని రెండు సొసైటీల్లో 205 మంది సభ్యులు ఉండగా.. 118 మంది ఇసుక క్వారీ నిర్వహణకు నల్లపోచమ్మతల్లి సొసైటీని గుర్తిస్తూ ఆమోదించారు. కొందరు అభ్యంతరం తెలిపారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్వారీ నిర్వహణకు నిబంధనల ప్రకారం పెసా గ్రామసభలో 68 మంది సభ్యుల కోరం ఉంటే సరిపోతుందన్నారు. నల్లపోచమ్మతల్లి సొసైటీని గుర్తిస్తూ మెజార్టీ సభ్యుల తీర్మానం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. గ్రామసభ సందర్భంగా ఎలాంటి గొడవలు, ఆందోళనలు జరుగకుండా ఉండేందుకు ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ భద్రూనాయక్, ఎంపీఓ మమత, పంచాయతీ కార్యదర్శి వనజ, పెసా కోఆర్డినేటర్ మడి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్వీయ అభ్యసనకు చర్యలు


ఏఐ విద్యాబోధన ప్రారంభిస్తున్న డీఈఓ పాణిని

ములుగు రూరల్: విద్యార్థుల స్వీయ అభ్యసనకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పత్తిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)తో విద్యాబోధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌లను వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సాంధించేలా కృషి చేయాలని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తగిన ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్పీ మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, శివప్రసాద్, వైనాల స్వామి, పాడియా రవి, మురళి, శ్రీనివాస్, నరసింహచారి, శివరాం, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ తో విద్యార్థులకు మేలు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో విద్యార్థులకు మేలు జరుగుతుందని జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి అన్నారు. మండలంలోని బీరెల్లి పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా బీరెల్లి పాఠశాల ఎంపిక కావడం ఆనందంగ ఉందన్నారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్ట్

కాటారం: మండలానికి చెందిన మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై–2 శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కార్తీక్, మరో మైనర్ బాలుడు పాఠశాలకు వెళ్లే దారిలో మైనర్ బాలికను అడ్డగించి వేధించడంతో పాటు బెదిరించసాగారు. దీంతో సదరు బాలిక కుటుంబ సభ్యులకు తెలపడంతో తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇరువురిపై పోక్సో కేసు నమోదు చేసి కార్తీక్‌ను రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్సై–2 శ్రీనివాస్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్ తండా, పాశిగడ్డతండా, అందుకుతండా గ్రామాల్లో నాటుసారాయి తయారు చేస్తుండగా శుక్రవారం దాడులు చేపట్టినట్లు ప్రోహిబేషన్, ఎక్సైజ్ సీఐ వి.రమ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలోని గ్రామాలలో నాటు సారాయి నిర్మూలనకోసం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈ దాడులలో ఏడుగురిపై కేసులు నమోదుచేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 18లీటర్ల నాటుసారాయి, 40 కిలోల చక్కర, 5 కిలోల పట్టిక స్వాధీనం చేసుకుని 1400 లీటర్ల చక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం సారాయి అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, భూపాలపల్లి ఎస్సై రబ్బాని, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శిరీషరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న రవిచందర్

ములుగు: ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ.. తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరం ఏర్పాటు చేసిన అధికారులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో 280 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. ములుగు లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శిబిరంలో పండ్లు, మినరల్ వాటర్ అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్‌రావు, రవిచందర్ చేతుల మీదుగా రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీజీఓ అసోసియేటెడ్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జీవన్ కుమార్, కోశాధికారి ప్రకాశ్‌రెడ్డి, టీఎన్జీవోస్ అధ్యక్షుడు రాజు, చైతన్య, నాయకులు రఫీక్, శిరీష, దేవారాజ్, శైలజ, దురగరావు, జవహర్ రెడ్డి, బాలయ్య, నరసింహ ఉన్నారు.

పరీక్ష కేంద్రాల సందర్శన


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి, మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ముద్దమల్ల రాజేందర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముల్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు శుక్రవారం ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టర్‌పై ఫిర్యాదు


ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రామిళ్ల రాజబాబు

కాటారం: కౌలు రైతు ఆత్మహత్య ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీలో జరిగిన అవకతవకలపై వివరాలు అడిగితే కలెక్టర్ రాహుల్‌శర్మ తమపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ కాటారం మండలకేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు శుక్రవారం ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాజబాబు తండ్రి రామిళ్ల మల్లయ్య కౌలు రైతు కాగా కొంత కాలం క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఎక్స్‌గ్రేషియా మంజూరు జాబితాలో మల్లయ్య పేరు ఉండగా జిల్లా అధికారులు వెల్లడించిన జాబితాలో మాత్రం మల్లయ్య పేరుతోపాటు మరికొంత మంది రైతుల పేర్లు లేవని రాజబాబు తెలిపారు. దీంతో గత వారం జరిగిన ప్రజావాణిలో ఎక్స్‌గ్రేషియా జాబితాలో అవకతవకలపై కలెక్టర్‌ను అడగగా సరైన సమాధానం చెప్పకుండా తమపై దురుసుగా ప్రవర్తించి అసహనం వ్యక్తం చేసినట్లు రాజబాబు పేర్కొన్నారు. ఈ విషయాలను ఎస్సీ కమిషన్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కలెక్టర్ వ్యవహార శైలిపై విచారణ జరపాలని, ఎక్స్‌గ్రేషియా అందేలా న్యాయం చేయాలని కోరినట్లు రాజబాబు తెలిపారు. దీంతో స్పందించిన డైరెక్టర్ కలెక్టర్‌కు నోటీస్ జారీ చేసినట్లు వివరించారు.

ఈసారీ లోటు బడ్జెటేనా..?

కేయూ అంచనా బడ్జెట్ రూ.428 కోట్లపైనే..

- బ్లాక్‌గ్రాంట్ కింద రూ.145.62 కోట్ల కేటాయింపు
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.31 కోట్లు
- మౌలిక సదుపాయల కల్పనకు రూ.50 కోట్లు
- నేడు కేయూ 40వ అకడమిక్ సెనెట్ సమావేశం





కేయూ క్యాంపస్: 2025 – 2026వ ఆర్థిక సంవత్సరానికి కాకతీయ యూనివర్సిటీ అంచనా బడ్జెట్ సుమారు రూ.428 కోట్లకు పైగా ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 29న కాకతీయ యూనివర్సిటీ 40వ అకడమిక్ సెనెట్ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి బ్లాక్‌గ్రాంట్ కింద రూ.145.62 కోట్లు కేటాయించింది. ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కేవలం టీచింగ్, నాన్ టీచింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాలకే సరిపోతోంది. అలాగే, ఈసారి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మరో రూ.31 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరం (2024 – 2025)లో బ్లాక్ గ్రాంట్ కింద కాకతీయ యూనివర్సిటీకి రూ.134.94 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.145.62 కోట్లు కేటాయించటంతో గత సంవత్సరంతో పోలిస్తే సుమారు రూ.10 కోట్ల నిధులు పెంచడంతో కొంత ఊరట లభించినట్లయింది.

విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ ఆలస్యమే

యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు వేతనాల కింద బ్లాక్‌గ్రాంట్‌గా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం.. ప్రొఫెసర్ల సర్వీస్ పూర్తయ్యాక, ఉద్యోగ విరమణ పొందితే మాత్రం వారికి వచ్చే వివిధ బెనిఫిట్స్ నిధులు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదు. అంతర్గత నిధుల ద్వారానే చెల్లింపులు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకు విరమణ పొందుతున్న ఉద్యోగులు, ప్రొఫెసర్లకు బెనిఫిట్స్‌ను కొంత ఆలస్యంగానైనా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచే చెల్లిస్తున్నారు. ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60ఏళ్ల నుంచి 65ఏళ్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో మరో ఐదేళ్ల పాటు ఉద్యోగ విరమణలు ఉండవు.

రెగ్యులర్ కంటే పెన్షనర్లే ఎక్కువ

ప్రస్తుతం యూనివర్సిటీలో 77 మంది రెగ్యులర్ అధ్యాపకులుండగా, కాంట్రాక్టు లెక్చరర్లు 179, పార్ట్‌టైం లెక్చరర్లు 205 మంది వరకు పనిచేస్తున్నారు. పెన్షనర్లు (అధ్యాపకులు) 254 మంది ఉండగా, ఫ్యామిలీ పెన్షనర్లు 79 మంది వరకు ఉన్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగులు 365 మంది, 33 మంది టైంస్కేల్ ఉద్యోగులు, పెన్షనర్లు 450 మంది, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 507 మంది ఉన్నారు.

మొక్కుబడిగా అకడమిక్ సెనెట్ సమావేశం

కాకతీయ యూనివర్సిటీలో అకడమిక్ సెనెట్ అత్యంత కీలకమైంది. ఇందులో అకడమిక్ విద్యాపరమైన అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. కొత్త కోర్సులు, సిలబస్ మార్పులు చేర్పులు, పరిశోధనలకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలి, ఇతర యూనివర్సిటీల్లో ఎలాంటి అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి, కాకతీయ యూనివర్సిటీలో విద్యాపరమైన అంశాలపై ప్రత్యేకంగా చర్చలు జరగాల్సి ఉంటుంది. అయితే, దశాబ్దంన్నర కాలంగా అకడమిక్ సెనెట్ సమావేశం మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. పేరుకు అకడమిక్ సెనెట్ సమావేశం అని చెప్పి అందులోనే కేయూ అంచనాల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

నిర్దిష్ట సంఖ్యతో ఉండే అకడమిక్ సెనెట్ ఏది?

అకడమిక్ సెనెట్‌లో ఉండే సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారం అకడమిక్ సెనెట్‌లో వీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మాజీ వీసీలు, అన్ని విభాగాల డీన్లు, పాలక మండలి సభ్యులుగా ఉన్నారు. సమాజంలో వివిధ రంగాల్లోని వారు కూడా సభ్యులుగా ఉండవచ్చు. సెనెట్‌ను అలా పునర్ వ్యవస్థీకరిస్తే 100మందికి పైగా సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం 21మంది సభ్యులతోపాటు కాకతీయ యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరీక్షల విభాగం అధికారులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తున్నారు.

రూ.8 కోట్లు లోటు బడ్జెట్ చూపే అవకాశం

కేయూలో 2024 – 2025వ ఆర్థిక సంవత్సరంలో రూ.431 కోట్లకుపైగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025 – 2026లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ 145.62 కోట్లతోపాటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌కు రూ.31 కోట్లు, డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.50 కోట్లు అంతర్గత నిధుల ద్వారా ఇతరత్రా వనరుల ద్వారా రాబడి కొంత ఎక్కువగానే వస్తుందని భావించి, రూ.428 కోట్లకు పైగా బడ్జెట్ ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. వ్యయం కూడా అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో రూ.8 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల విభాగం, అకడమిక్ పరంగా వచ్చే ఫీజులు, ఎస్‌డీఎల్‌సీఈ (దూరవిద్య కేంద్రం) ద్వారా వచ్చే నిధులు, యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల అఫిలియేషన్ల ద్వారా వచ్చే ఫీజులు, పరీక్షల ఫీజులు, అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీ, ఇతర వనరుల ద్వారా రాబడి వస్తుందని అంచనా వేసే అవకాశాలున్నాయి. 2023–2024లో యూనివర్సిటీ బడ్జెట్ రూ.15.47 కోట్లు లోటు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024 – 2025లో రూ.11 కోట్లకుపైగా లోటు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2025 – 2026లో రూ.8 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపెట్టే అవకాశాలున్నట్లు సమాచారం.

అభివృద్ధి కోసం రూ.50 కోట్లు

కాకతీయ యూనివర్సిటీలో వివిధ సదుపాయలు, అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో మరో రూ.50 కోట్లు కేటాయించింది. గత 11 ఏళ్లుగా అభివృద్ధి కోసం నిధులు రావడం లేదు. గత ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆ తరువాత విడుదల చేయలేదు. ఈసారి ఇప్పటి ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేస్తే అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పనకు వినియోగించే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రొఫెసర్ సురేష్‌లాల్

కాకతీయ యూనివర్సిటీ 40వ అకడమిక్ సెనెట్ సమావేశాన్ని పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. 2023 – 2024 వార్షిక నివేదిక, 2024 – 20245 కేయూ స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. 2025 – 2026 అంచనాల బడ్జెట్‌ను కేయూ ఎకనామిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్, పాలక మండలి సభ్యుడు సురేష్‌లాల్ ప్రవేశపెట్టనున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, సెనెట్ సభ్యులు పాల్గొననున్నారు.

క్లుప్తంగా

6న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన అండర్ –19 ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని తి రుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారిలో నలుగురు బాలురు, నలుగురు బాలికలను మే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పేర్లు నమోదు, వివరాల కోసం 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి



పరీక్ష రాసి వస్తున్న రోహిత్

కమలాపూర్: తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థి పదో తరగతి పరీక్ష రాశాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లికి చెందిన ముత్తినేని రోహిత్.. కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్ష సెంటర్ పడింది. రోహిత్ తండ్రి వెంకట్రావు (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, అదేరోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. తండ్రి అంత్యక్రియలు పూర్తైన మరునాడు శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉండడంతో పుట్టెడు దుఃఖంలోనూ విద్యార్థి రోహిత్ హాజరయ్యాడు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- మరొకరికి స్వల్ప గాయాలు
- స్కూటీని లారీ ఢీ కొట్టడంతో ఘటన



బండి కీర్తి (ఫైల్)

ఎల్కతుర్తి: ఓ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా లారీ నడిపిన ఘటనలో యువతి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతినగర్ సమీపంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బండి కీర్తి (24) బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. విధుల్లో భాగంగా కీర్తి తన సహోద్యోగి చందనతో కలిసి స్కూటీపై కరీంనగర్ జిల్లా తాడికల్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని శాంతినగర్ సమీపంలో (జీజే06 బీటీ 8139) నంబర్ గల లారీ హుజూరాబాద్ నుంచి ఎల్కతుర్తి వైపు వస్తున్న క్రమంలో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి స్కూటీని బలంగా ఢీకొట్టాడు. దీంతో వెనుక కూర్చున్న కీర్తి కింద పడడంతో ఆమెపై నుంచి లారీ ఎక్కడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన కీర్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి బండి రాజు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీఎస్టీ బకాయి చెల్లింపులపై జరిమానా మాఫీ

వరంగల్: జీఎస్టీ అమలులోకి వచ్చిన తొలి మూడేళ్లల్లో బకాయి ఉన్న వినియోగదారులు ఈనెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి జరిమానా, వడ్డీని మాఫీ చేస్తున్నట్లు వరంగల్ జిల్లా వాణిజ్య పన్నుల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2017 – 18, 2018 – 19, 2019 – 20వ సంవత్సరాలకు గాను మదింపు చేసిన పన్ను మొత్తాన్ని చెల్లిస్తే దానిపై వేసిన జరిమానా (పెనాల్టీ), వడ్డీ మాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అప్పీలేట్ అథారిటీ, కోర్టులో ఛాలెంజ్ చేసిన మదింపు ఉత్తర్వులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈనెల 31లోపు పన్ను చెల్లించి, జూన్ 30లోపు జీఎస్‌టీ పోర్టల్‌లో సదరు దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గడువు సమీపిస్తుండడంతో ఆసక్తి గల పన్ను చెల్లింపుదారులు దరఖాస్తుతో నిమిత్తం లేకుండా గడువులోగా పన్నులు చెల్లించాలని సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారని వివరించారు. మరిన్ని వివరాలకు జీఎస్టీ అధికారులను సంప్రదించాలని పన్నుల అధికారి కోరారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



సాయి (ఫైల్)

నెక్కొండ: ప్రేమించిన యువతి కాదనడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముడుసు లక్ష్మి – నర్సింహస్వామి దంపతుల రెండో కుమారుడు సాయి (26).. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కొంతకాలంగా ప్రేమలో పడ్డాడు. హైదరాబాద్‌లో ఇద్దరు వేర్వేరుగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారి వివాహానికి పెద్దలు ఇటీవల అంగీకరించారు. అయితే, సాయిని వివాహం చేసుకోవడం ఇష్టం లేక ఆ యువతి దూరం పెట్టింది. దాంతో మనస్థాపానికి గురైన అతను ఈనెల 27న రాత్రి 2 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సాయి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆ సబ్ ఇంజనీర్ల టర్మినేషన్‌కు నిర్ణయం?

- అక్రమంగా ఎంపికైన వారికి నోటీసులు జారీ
- నేరుగా అభ్యర్థులకు చేరవేత

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో అక్రమంగా నియామకమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ ఇంజనీర్లను టర్మినేట్ చేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు నోటీసులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో చేపట్టిన సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో భారీగా అక్రమాలు జరిగిన విషయం విదితమే. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాటు భర్తీ చేసిన నియామకాల్లోనూ అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెలుగు చూశాయి. సబ్ ఇంజనీర్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి అర్హులైన అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సచివాలయంలోని ప్రజాపాలనలోనూ వినతులు అందజేశారు. ఈ క్రమంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేయగా, రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని కమిటీ గుర్తించింది. 24 మందిని నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేశారని విచారణలో తేల్చింది. వారికి శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విచారణ కమిటీ నివేదిక ప్రకారం టర్మినేషన్ ఎందుకు చేయకూడదో తెలపాలంటూ ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న సబ్ ఇంజనీర్లకు ఉన్నతాధికారులు నోటీసులు చేశారు. 15 రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసులు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నోటీసులోని అంశాలు బహిర్గతం కాకుండా నేరుగా అభ్యర్థులకే చేరవేస్తున్నారు. ఈ విషయంపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని వివరణ కోరగా నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారు సంజాయిషీ ఇచ్చుకోవడానికి కొంత సమయం ఇచ్చామని, వారు ఇచ్చిన సమాధానాన్ని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని వరుణ్‌రెడ్డి వివరించారు.

9.5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

తొర్రూరు: నిషేధిత గంజాయి తరలిస్తున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై జి.ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన వికాస్ పీతంబర్ మోతె, నరేష్ పాండురంగ కలిసి ఒడిశా నుంచి 9.5 కిలోల ఎండు గంజాయిని సొంత రాష్ట్రానికి తరలించేందుకు తొర్రూరు బస్టాండ్‌లో శుక్రవారం దిగారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వారి వద్ద తనిఖీ చేయగా గంజాయి లభించింది. దాని విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చేప పిల్లల పెంపకంతో లాభాలు

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న
- ముగిసిన ఐదు రోజుల శిక్షణ శిబిరం

మామునూరు: చేప పిల్లల నర్సరీ, పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, వరంగల్ జిల్లా మత్స్య అధికారి నాగమణి అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో ఐదు రోజులుగా జరుగుతున్న కార్ప్ చేప పిల్లల పెంపకంపై శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా చేపల పెంపకాన్ని కొనసాగించాలని సూచించారు. చేపల పెంపకంతో పాటు చేప పిల్లల ఉత్పత్తి ఆవశ్యకతను వివరించారు. చేప పిల్లల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణార్థులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గణేష్, సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

1,200 ఎకరాల్లో సభ నిర్వహణ

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్, పక్కన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు

హన్మకొండ: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా పార్టీ ఆవిర్భావం రోజు ఏప్రిల్ 27న 1,200 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్కతుర్తిలో 150 ఎకరాల్లో సభ నిర్వహణ, 1,050 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. ఆర్టీసీ, ఇతర వాహనాలు కలిపి 40 వేల నుంచి 50 వేల వాహనాలు రావచ్చని అంచనా వేశామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వొడితల సతీష్‌బాబు, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్, నాయకులు గ్యాదరి బాలమల్లు, నాగుర్ల వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మర్రి యాదవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.



అనుమతి కోసం కాజీపేట ఏసీపీకి దరఖాస్తు ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

బీఆర్ఎస్ సభ అనుమతికి దరఖాస్తు

ఎల్కతుర్తి: ఏప్రిల్ 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వేదిక ఖరారైంది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సతీష్ బాబు తదితరులు శుక్రవారం సభాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం సభ నిర్వహణ, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర అనుమతుల కోసం కాజీపేట ఏసీపీ తిరుమల్‌ను నేతలు కలిసి దరఖాస్తు ఇచ్చారు.

అప్పల బాధతో ఇద్దరి బలవన్మరణం



హుస్సేన్ (ఫైల్)

గూడూరు: అప్పుల బాధ తాళలేక ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కోబల్‌తండా శివారు మూడుగుడిసెల లైన్‌తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బానోతు హుస్సేన్ (34).. భార్య సరిత, ఇద్దరు కొడుకులతో కలిసి వ్యవసాయంతో పాటు ట్రాలీ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ ఖర్చులు, వ్యవసాయం, ఆటో కొనడానికి రూ.5 లక్షలు అప్పు చేశాడు. వ్యవసాయంలో ఆదాయం రాకపోగా, ఆటో నడపినా గిరాకీ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పు ఎలా తీర్చాలో అని గత కొన్ని రోజులుగా భార్యతో చెప్పుకుంటూ మదనపడుతుండే వాడు. ఈ క్రమంలో సోమవారం ఆటోలో వెళ్లిన హుస్సేన్.. మర్రిమిట్ట సమీపంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి గూడూరు సీ హెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప రిస్థితి విషమంగా ఉండడంతో వరంగ ల్ ఎంజీ ఎంకు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఆ స్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి హుస్సేన్ మృతిచెందాడు. భార్య సరిత ఫి ర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీత్లాతండాలో వ్యవసాయ కూలీ..

మహబూబాబాద్ రూరల్: అప్పుల బాధతో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని సీత్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఈరియా తండాలో శుక్రవారం జరిగింది. రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపిన వివరాల ప్రకారం ఈరియా తండాకు చెందిన బానోతు రవి (35) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో అప్పులు పెరిగిపోగా, వాటిని ఎలా తీర్చాలో తెలియక ఈనెల 25న మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం రవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నూతన ఔషధాలు కనిపెట్టాలి

కేయూ క్యాంపస్: ఫార్మసీ రంగంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని, ఇంకా నూతన ఔషధాలను కనుగొనాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సూచించారు. హనుమకొండలో వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఎథికల్ రెస్పాన్సిబులిటీస్ ఆఫ్ స్టూడెంట్స్ రీసెర్చర్స్ ఇన్ హ్యాండ్లింగ్ ఆఫ్ ఎక్స్‌పరిమెంటల్ ఎనిమల్స్ ఇన్ ఫార్మలాజికల్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న సైంటిఫిక్ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదవితే భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వరవ ఐభవ, డాక్టర్ గిరిజ, శ్రవణ్‌కుమార్, కుమారస్వామి, మహేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తి బతికున్నట్లు సృష్టి

- 13ఏళ్లుగా రూ.45 లక్షల మేర పెన్షన్ స్వాహా?
- అదే పేరు కలిగి ఉన్న వృద్ధుడితో లైఫ్ సర్టిఫికెట్
- హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: 13 ఏళ్ల క్రితం ఓ పెన్షనర్ చనిపోయాడు. కానీ, మరణించిన పెన్షనర్ పేరు కలిగి ఉన్న ఓ వృద్ధుడిని తెరపైకి తీసుకొచ్చి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించుకుంటూ పెన్షన్ పొందుతూ వచ్చారు. ఈ మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే హసన్‌పర్తికి చెందిన వేల్పులు రాములు తండ్రి కొంరయ్య పంచాయతీరాజ్ శాఖలో నాలుగో తరగతి ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందాడు. నెలనెలా పెన్షన్ పొందుతున్నాడు. అతను 2012లో మృతిచెందాడు. కానీ, కుటుంబసభ్యులు రాములు మృతి చెందినట్లు ట్రెజరీశాఖకు సమాచారం ఇవ్వలేదు.

అదే పేరుతో ఉన్న వృద్ధుడిని తెరపైకి..

అదే కాలనీలో వేల్పుల రాములు తండ్రి కొంరయ్య అనే వృద్ధుడు ఉన్నాడు. నాలుగో తరగతి ఉద్యోగి రాములు చనిపోయిన విషయాన్ని కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచి అదే కాలనీలోని రాములు పేరు గల వృద్ధుడిని తెరపైకి తీసుకొచ్చారు. ప్రతీ ఏడాది లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడంతో ప్రతినెలా పెన్షన్ డబ్బులు ఆ బ్యాంక్‌లో జమవుతున్నాయి. ఇప్పటివరకు సుమారు రూ.45లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వెలుగు చూసింది ఇలా..

ఆసరా పెన్షన్ పొందుతున్న రాములుకు ఏడాది క్రితం పెన్షన్ నిలిపివేశారు. దీంతో అతని మనుమడు కార్తీక్ ఈ విషయమై అధికారుల చుట్టూ తిరగగా, తన తాత సర్వీస్ పెన్షన్ పొందుతున్నట్లు వెల్లడైంది. తన తాత ఎలాంటి ప్రభుత్వం ఉద్యోగం చేయలేదని, మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడని పోలీసులకు తెలిపారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఆటో ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు

కాజీపేట అర్బన్: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆటో ఢీ కొట్టగా వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓరుగల్లు పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది చైతన్య, బాలాజీ నాయక్ కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురానికి చెందిన 60 ఏళ్ల చల్లపల్లి బాబురావు హంటర్‌రోడ్డులోని ఓ హాస్టల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వ్యక్తిగత పని మీద ఓరుగల్లు పెట్రోల్ బంక్ ప్రాంత వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని ఆటో అతన్ని ఢీ కొట్టింది. దాంతో బాబురావు ఎడమ కాలు పూర్తిగా విరిగి నుజ్జునుజ్జయింది. 108 అంబులెన్స్‌లో అతన్ని ఎంజీఎంకు తరలించారు.